సాక్షి నిజామాబాద్

ఆదివారం । 17 । మార్చి । 2024



కొనసాగుతున్న నీటివిడుదల

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు కాల్వల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం 37.0 /24.5

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత కాస్త తగ్గవచ్చు, రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నలుగురికి కార్పొరేషన్ పదవులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పలు కార్పొరేషన్‌లకు చైర్మన్‌లను ప్రకటించింది. తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థకు అన్వేశ్ రెడ్డి, ఖనిజాభివృద్ధి సంస్థకు ఈరవత్రి అనిల్, తెలంగాణ కోఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్‌కు మానాల మోహన్ రెడ్డి చైర్మన్‌లుగా నియామకమయ్యారు. వీరు ముగ్గురు బాల్కొండ నియోజకవర్గానికి చెందిన వారు కావడం గమనార్హం. బాన్సువాడకు చెందిన కాసుల బాల్‌రాజ్ తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నామినేట్ అయ్యారు.

ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి రద్దు

సుభాష్‌నగర్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి తిరిగి యథావిధిగా కొనసాగుతుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

క్యాంపునకు తరలిన కౌన్సిలర్లు

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక ఈ నెల 21న నిర్వహించనున్న నేపథ్యంలో ఆశావహులు కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు. బల్దియా చైర్‌పర్సన్ పీఠాన్ని బీసీ మహిళకు రిజర్వ్ చేయడంతో రెండో వార్డు కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత శ్రీనివాస్, 23వ వార్డు కౌన్సిలర్ వన్నెల్ దేవి లావణ్య శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. ఖాందేశ్ సంగీత వరుసగా మూడుసార్లు విజయం సాధించి రేసులో ఉండగా.. వన్నెల్ దేవి లావణ్య మొదటిసారి కౌన్సిలర్‌గా విజయం సాధించి చైర్‌పర్సన్ రేసులో ఉన్నారు. వీరిద్దరూ ఆర్మూర్‌లో బలమైన సామాజిక వర్గాలకు చెందిన వారు కావడం మరో ప్లస్ పాయింట్‌గా చెప్పవచ్చు. సంగీత ఖత్రి (క్షత్రియ సమాజ్), లావణ్య మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఈ రెండు సామాజికవర్గాల ఓట్లు కీలకం కానున్నాయి. మరి వీరిద్దరిలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఎవరిని చైర్‌పర్సన్ పీఠంపై కూర్చోబెడతారో వేచి చూడాల్సిందే.

పెళ్లికి వెళ్లివస్తున్న ఆటో బోల్తా : ఇద్దరి మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): పెళ్లికి హాజరై తిరిగి వెళ్తుండగా ఆటో బోల్తాపడి ఇద్దరు మృతి చెందగా, పదిమందికి తీవ్ర గాయాలైన ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం బాయంపల్లి శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలం సింగితం, గున్కుల్, వడ్డెపల్లి నుంచి లింగంపేట మండలం కొర్పోల్‌లో జరుగుతున్న బంధువుల పెళ్లికి పలువురు ఆటోల్లో చేరుకున్నారు. పెళ్లయిన తర్వాత ఓ ఆటోలో 12 మంది తిరుగు ప్రయాణమయ్యారు. బాయంపల్లి శివారులోని మూలమలుపులో ఆటో అదుపుతప్పి రోడ్డు కిందికి పల్టీలు కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న సింగీతం గ్రామానికి చెందిన గౌడగారి సంగయ్య(66) అక్కడి కక్కడే మృతి చెందాడు. గున్కుల్‌కు చెందిన లాలవ్వ చికిత్స పొందుతూ ఎల్లారెడ్డి ఆస్పత్రిలో మృతి చెందింది. నిజాంసాగర్ మండలం గున్‌కుల్, వడ్డెపల్లిలకు చెందిన బాలమణి, సతీశ్, సాయవ్వ, పోచవ్వ, కవిత, మరొకరితో పాటు ముగ్గురు చిన్నారులకు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్సులో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతితో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

అమలులోకి కోడ్!



పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ప్రకటించడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకూ ప్రవర్తనా నియమావళి అమలులో ఉండనుంది. రాష్ట్రంలో ఏప్రిల్ 18న నోటిఫికేషన్ రానుండగా, మే 13న పోలింగ్ జరగనుంది. జూన్ 4న కౌంటింగ్ చేపడతారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల దరఖాస్తు, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా కలెక్టర్ వ్యవహరించనున్నారు. నామినేషన్ల స్వీకరణ కలెక్టరేట్‌లోనే కొనసాగుతుంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున అభ్యర్థులు ప్రచారంపై దృష్టి పెట్టనున్నారు.

- షెడ్యూల్ ప్రకటించిన సీఈసీ
- మే 13న పోలింగ్.. జూన్ 4న కౌంటింగ్..
- ప్రచారంపై దృష్టి పెట్టనున్న అభ్యర్థులు..

సుభాష్‌నగర్ : నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికలు సజావుగా సాగేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే తుది ఓటరు జాబితా ప్రకటించ గా, బీయూ, ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రి య పూర్తయ్యింది. ఓటర్ల నమోదు, రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో ఫస్ట్ లెవల్ ఈవీఎంల పరిశీలన, తదితర ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పరిశీలన, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు, మోడల్, మహిళా, వికలాంగ పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తున్నారు. రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, ప్రిసైడింగ్, సెక్టోరల్ అధికారులను నియమించనున్నారు. ఇప్పటికే ఉద్యోగుల డేటాను సేకరించారు. 85 ఏళ్ల పైబడిన వయస్సు గలవారు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం గలవారికి ఇంటి నుంచి ఓటేసే సౌకర్యం ఈసీ కల్పిస్తోంది. ఇందుకోసం ముందే రిజిస్టర్ చేసుకుంటే పోలింగ్ సిబ్బంది స్వయంగా ఇంటికి వచ్చి ఓటు నమోదు చేసుకుంటారు.

కట్టుదిట్టంగా ఎన్నికల నియమావళి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్
- ఎన్నికల నిర్వహణపై మార్గనిర్దేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, సీపీ, అదనపు కలెక్టర్లు

సుభాష్‌నగర్: పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి డీజీపీ రవిగుప్తా, ఇతర అధికారులతో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా నుంచి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రభుత్వ భవనాల్లో రాజకీయ పార్టీలు, నాయకుల హోర్డింగులు, ఫొటోలు, వాల్ రైటింగ్స్ తొలగించాలని సూచించారు. రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజల ర్యాలీలు, సభల నిర్వహణకు అనుమతులు, నిబంధనల ప్రకారం ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో జారీచేయాలని సూచించారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యేలోపు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, కంట్రోల్ రూం, మీడియా సెంటర్ ఏర్పాటు, ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది శిక్షణ పూర్తి చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వివరాలు సమర్పించాలన్నారు. శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికలకు సంబంధించి రిపోర్ట్ ప్రతిరోజూ సమర్పించే విధంగా జిల్లాలో వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు కంట్రోల్‌రూం ఏర్పాటు చేయాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించే సమయంలో నిబంధనలు పాటిస్తూ నామినేషన్‌లో అన్ని అంశాలు నింపారో.. లేదో చెక్ చేసుకోవాలని, నింపని పక్షంలో సదరు అభ్యర్థులకు రాత పూర్వకంగా సమాచారం అందించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, వివిధ శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. వీసీలో ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, ఆర్డీవోలు, డీసీపీలు, ఏసీపీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందూరుకు అభయాంజనేయం



- నగరంలోకి ప్రవేశించగానే హనుమద్దర్శనం
- 54 అడుగుల ఎత్తులో దేదీప్యమానంగా వెలిగిపోతున్న విగ్రహం
- ప్రతి ఏటా హనుమాన్ దీక్షాపరులకు 42 రోజుల పాటు భిక్ష

ఇందూరు నగరానికి 54 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం తలమానికంగా నిలుస్తోంది. హైదరాబాద్ వైపు నుంచి నగరంలోకి అడుగు పెట్టగానే దేదీప్యమానంగా వెలుగుతూ భారీ హనుమంతుడి విగ్రహం దర్శనమిస్తోంది. బోర్గాం(పి) దాటగానే వినాయక్‌నగర్ ప్రారంభంలో గల ఈ ఆలయ ప్రాంతం హనుమాన్ జంక్షన్‌గా అందరికీ సుపరిచితం. భారీ విగ్రహం కిందిభాగంలో ప్రతిష్ఠించిన ఆలయానికి ప్రతి శనివారం పెద్దఎత్తున వచ్చే భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు.


– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

సండే స్పెషల్

- 2018 మార్చి 30న భక్తులు, దాతల ఆధ్వర్యంలో ఒక కమిటీగా ఏర్పడి ఈ ఆలయానికి శంకుస్థాపన చేశారు. దుర్గాప్రసాద్ స్వామీజీ, వేముల నాగభూషణం స్వామీజీ ఆధ్వర్యంలో ఈ క్రతువు ప్రారంభించారు. రికార్డు స్థాయిలో కేవలం 12 నెలల కాలంలోనే ఆలయ నిర్మాణంతో పాటు 30 అడుగుల పునాదితో 54 అడుగు ల భారీ విగ్రహ ఏర్పాటు చేశారు. 2019 ఏప్రిల్ 20న విగ్రహ ఆవిష్కరణతో పాటు ఆలయంలో మూలవిరాట్టుకు ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆల యంలో నిత్య పూజా క్రతువులు నిర్వహించేందుకు గాను ప్రత్యేకంగా పూజారిని నియమించి, పూజారి ఉండేందుకు వీలుగా 2020లో మూడు గదులు నిర్మించారు. గార్డెన్ ఏర్పాటు చేశారు.

కమిటీ ఆధ్వర్యంలో..

ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో అన్ని కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఏటా మార్చి–ఏప్రిల్ మధ్య కాలంలో 42 రోజుల పాటు హనుమాన్ మాల వేసుకున్న దీక్షాపరులకు భిక్ష అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ నెల 14న భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా వార్షికోత్సవ కార్యక్రమాల కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆకుల శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి బాడ్సి శేఖర్‌గౌడ్, కోశాధికారి పొద్దుటూరి గంగారెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.3 లక్షలతో భారీ ఆంజనేయ స్వామి విగ్రహానికి రంగులు వేయించారు. వార్షికోత్సవం ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు వారు వివరించారు.



ఆలయంలోని హనుమాన్ విగ్రహం

నిబంధనలు హుష్‌కాకి



స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

- ఇంటర్ ముల్యాంకనంలో ప్రభుత్వ అధ్యాపకులకు అన్యాయం
- చీఫ్ ఎగ్జామినర్ల నియామకంలో నిబంధనల అతిక్రమణ
- స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం క్యాంప్ ఆఫీసర్‌కు టీజీఎల్‌ఏ వినతి

సాక్షిప్రతినిధి, నిజామాబాద్: ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ విషయంలో నిబంధనలు పాటించడం లేదంటూ తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ల(టీజీఎల్‌ఏ) సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ ఇంటర్ స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా చీఫ్ ఎగ్జామినర్ల నియామకాలు చేపట్టడం సరికాదంటూ సంఘాల బాధ్యులు అంటున్నారు. సీనియారిటీ పాటించకుండా జూనియర్లకు చీఫ్ ఎగ్జామినర్లుగా అపాయింట్‌మెంట్ ఇవ్వడం సరికాదంటూ శనివారం ఉమ్మడి జిల్లాకు చెందిన టీజీఎల్‌ఏ 711, టీజీఎల్‌ఏ 359, టీజీఎల్‌ఏ 475 సంఘాల బాధ్యులు స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం క్యాంప్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. బోర్డు నిబంధనల మేరకు ప్రభుత్వ అధ్యాపకులకు చీఫ్ ఎగ్జామినర్లుగా మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా రెసిడెన్షియ ల్ జూనియర్ కళాశాలల పీజీటీలకు, మోడల్ స్కూ ల్స్ అండ్ జూనియర్ కళాశాలలకు చెందిన పీజీటీలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. సీనియారిటీ పాటించకుండా తమకు అనుకూలంగా ఉన్న అనుభవం లేనివారికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం కారణంగా విద్యార్థులకు అన్యాయం జరిగే అవకాశముందని పేర్కొన్నారు.

2012 ఏపీపీఎస్సీ అధ్యాపకులకు, 2016లో డిస్ట్రిక్ ప్రమోషనల్ కమిటీ(డీపీసీ) నాన్‌టీచింగ్ ప్రమోషన్స్ ద్వారా నియమితులైన అధ్యాపకులకు జీరో సర్వీస్ ఉన్నప్పటికీ అప్పటి పేపర్ వాల్యుయేషన్‌లో క్యాంప్ ఆఫీసర్లు వారికి సబ్జెక్టు ఎక్స్‌పర్ట్(ఎస్‌ఈ), చీఫ్ ఎగ్జామినర్ (సీఈ)లుగా మొదటి ప్రాధాన్యతను ఇచ్చినట్లు అసోసియేషన్ల నాయకులు చెబుతున్నారు. కావున వీరితో పాటు కొత్తగా రెగ్యులర్ అయిన 132 మంది జనరల్, ఒకేషనల్ అధ్యాపకులకు సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్(ఎస్‌ఈ), చీఫ్ ఎగ్జామినర్ల(సీఈ)గా సీనియారిటీ ఆధారంగా నిబంధనల మేరకు మొదటి ప్రాధాన్యత ఇచ్చిన తర్వాతే మిగిలిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘాల బాధ్యులు అక్కం విష్ణు, భాస్కర్, లక్ష్మీనారాయణ, టి.నర్సింలు, రామకృష్ణారెడ్డి, విఠల్, గంగాధర్, రమేశ్ ఉన్నారు.

‘యాసంగి’ యాక్షన్ ప్లాన్ సిద్ధం..!

- ఆరు లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా
- 466 కొనుగోలు కేంద్రాలకు ప్రతిపాదనలు
- 298 రైస్‌మిల్లులకు కస్టమ్ మిల్లింగ్‌కు అనుమతి!

సుభాష్‌నగర్: యాసంగి ధాన్యం సేకరణకు జిల్లా పౌరసరఫరాల శాఖ, ఇతరాత్ర శాఖల అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధంచేశారు. సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సొసైటీలు, మెప్మా, ఐకేపీ, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో 466 కొనుగోలు కేంద్రాల ద్వారా లక్ష్యం మేరకు ధాన్యం సేకరించాలని భావిస్తున్నారు. 1.50 కోట్లకుపైగా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కాగా ఈ నెలాఖరున కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

4.16 లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లా వ్యాప్తంగా 4.16 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. వర్ని, రుద్రూర్, మోస్రా, చందూర్, సిరికొండ, మోపాల్ మండలాల్లో ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభమయ్యాయి. మరో 15 నుంచి 20 రోజుల్లో కోతలు ఊపందుకోనున్నాయి. సుమారు 11.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. స్థానిక అవసరాలు, రైస్‌మిల్లర్లు కొనుగోలు చేయగా మిగతా 6 లక్షల టన్నులను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ధాన్యం సేకరణపై త్వరలో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించనున్నారు.

1.50 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం

పౌరసరఫరా శాఖ అధికారులు నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం సేకరించేందుకు సుమారు 1.50 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే 1.10 కోట్ల వరకు గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండగా, మరో 40 లక్షల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. సేకరించిన ధాన్యం కస్టమ్ మిల్లింగ్ కోసం మొత్తం 298 మిల్లులకు అనుమతిచ్చారు. అందులో 64 బాయిల్డ్ రైస్‌మిల్లులు, 234 రా రైస్ మిల్లులు ఉన్నాయి. ధాన్యం తరలించేందుకు లారీల ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్ట్‌ను కూడా త్వరలోనే నిర్ణయించనున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా టెండర్ నోటిఫికేషన్ రాకపోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. గత సీజన్ కాంట్రాక్టే కొనసాగించే అవకాశముంది.

ఇబ్బందులు లేకుండా సేకరిస్తాం



యాసంగి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నాం. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. సీఎంఆర్ ఇవ్వని, అక్రమాలకు పాల్పడిన రైస్‌మిల్లులకు ఈసారి కేటాయింపులు చేపట్టడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల చివరలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం. – జగదీష్‌కుమార్, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

కవిత అరెస్టుపై నిరసనలు



నగరంలోని ధర్నా చౌక్ వద్ద మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నిజామాబాద్‌నాగారం: ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌పై జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిజామాబాద్ నగరంతో పాటు బోధన్, ఆర్మూర్, డిచ్‌పల్లిలలో ఆందోళనలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు ఆధ్వర్యంలో నాయకులు ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. బోధన్ పట్టణంలోని రైల్వే గేట్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. డిచ్‌పల్లిలో జెడ్పీటీసీ బాజిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన చేశారు. ఆర్మూర్‌లో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం అక్రమమన్నారు.

పంటలకు వడగళ్ల దెబ్బ



పెద్దవాల్గోట్‌లో నేలకొరిగిన వరి పంట

డొంకేశ్వర్(ఆర్మూర్): చేతికొచ్చిన యాసంగి పంటలను వడగళ్ల వర్షం దెబ్బతీసింది. శనివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయి మేఘావృతమైంది. ఈదురుగాలులుతో కూడిన వడగళ్ల వర్షం కురవడంతో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా సిరికొండ, ఇందల్వాయి మండలాల్లో ఎక్కువ వడగళ్లు పడ్డాయి. దీంతో ఈ ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరి గింజలు పొలాల్లోనే నేలరాలాయి. అదే విధంగా ఎదిగి పూతకు వచ్చిన నువ్వు పంట విరిగిపోయింది. మామిడి పిందెలు భారీగానే రాలిపోయాయి. కూరగాయల తోటలకు సైతం నష్టం వాటిల్లే అవకాశం ఉంది. వడగళ్ల వర్షంతో పంటల దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటు ధర్పల్లి, డిచ్‌పల్లి, భీమ్‌గల్, నిజామాబాద్, ఎడపల్లి, చందూర్, వర్ని, రుద్రూర్, కోటగిరి, నిజామాబాద్ రూరల్, పోతంగల్, జక్రాన్‌పల్లి, వేల్పూర్, బాల్కొండ, మెండోరా, మెస్కాల్, ఏర్గట్ల, ఆలూర్ మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ఈ మండలాల్లో కూడా పంటలకు నష్టం వాటిల్లే అవకాశముంది. అయితే, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పంటనష్టం అంచనాలను ఏఈవోల ద్వారా తెప్పించుకునే పనిలో ఉన్నారు.



నల్లవెల్లిలో నేలరాలిన వడ్లు

క్లుప్తంగా

రాష్ట్ర సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో బంగారు పతకం



డిచ్‌పల్లి: ఆదిలాబాద్‌ జిల్లా నేరెడిగొండలో శుక్రవారం ముగిసిన 8వ రాష్ట్ర సబ్‌జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీలలో నిజామాబాద్‌ జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించింది. జట్టు ప్రథమ స్థానం సాధించడంలో డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని అమూల్య కీలకపాత్ర పోషించి బంగారు పతకం అందుకుంది. ఈ సందర్భంగా అమూల్యను రాష్ట్ర అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలలో బంగారు పతకం సాధించిన అమూల్యను పాఠశాల హెచ్‌ఎం సుశీల్‌ కుమార్‌, పీఈటీ మర్కంటి గంగా మోహన్‌, ఉపాధ్యాయులు అభినందించారు.

చాంపియన్‌గా నిలిచిన జిల్లా జట్టు



నిజామాబాద్‌నాగారం: ఆదిలాబాద్‌ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర సబ్‌ జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌ బాలికల పోటీల్లో జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఈనెల 14 నుంచి 16 వరకు ఆదిలాబాద్‌ జిల్లా నేరడిగొండలో నిర్వహించిన 8వ రాష్ట్ర సబ్‌ జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌ బాలికల పోటీల్లో జిల్లా జట్టు సెమీఫైనల్‌లో మహబూబ్‌నగర్‌ జట్టుపై 12–2 పరుగుల తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. ఫైనల్‌ మ్యాచ్‌లో ఆదిలాబాద్‌ జట్టుపై 11–0 పరుగుల తేడాతో విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో బోథ్‌ ఎమ్మెల్యే అనిల్‌ యాదవ్‌, రాష్ట్ర సాఫ్ట్‌ బాల్‌ అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు చేతుల మీదుగా జిల్లా జట్టు క్రీడాకారులు బంగారు పతకాలు, ట్రోఫీ అందుకున్నట్లు జిల్లా సాఫ్ట్‌ బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ప్రభాకర్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగామోహన్‌ తెలిపారు. జట్లకు కోచ్‌ మేనేజర్లుగా మర్కంటి గంగామోహన్‌, నరేశ్‌, మౌనిక వ్యవహరించారు.

తెలుగుసాహిత్య అభిమానం పెంచేలా..



నిజామాబాద్‌ రూరల్‌: తెలుగుసాహిత్య అభిమానాన్ని పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సారంగపూర్‌ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మనోహర స్వామి పేర్కొన్నారు. పాఠశాలలో శనివారం కవయిత్రి చాడా లలితాదేవి రచించిన 'భావనాశతకాన్ని'విద్యార్థులు ధారణ చేసి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుభాషా చైతన్య కార్యక్రమాలు తమ పాఠశాలలో జరగడం పిల్లలకు గొప్ప ప్రేరణగా నిలుస్తుందన్నారు. చక్కని శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు సుంకరి గంగాధర్‌, రాజమణిలను అభినందించారు. సన్మాన గ్రహీత లలితాదేవి మాట్లాడుతూ... చక్కని ఉచ్చారణ, మంచి ధారణ, దారశుద్ధితో విద్యార్థులు తన శతకాన్ని చూడకుండా అప్పజెప్పడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం లలితాదేవిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో లలితా, సత్యనారాయణ రాధాకృష్ణ, గోపాల్‌, జావీద్‌ హుస్సేన్‌, సాగర్‌, గంగాధర్‌, సోమ్లా, సుజాత, లలిత, లత, రాజమణిలు పాల్గొన్నారు.

అకాల వర్షం.. పంటలకు నష్టం



రాకాసీపేటలో పిడుగు పడడంతో కాలుతున్న చెట్టు



నల్లవెల్లిలో దెబ్బతిన్న నువ్వుల పంట



నేలరాలిన వడ్లు



తాటిపల్లిలో కురిసిన వడగండ్లు

- ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం
- నేలరాలిన వడ్లు
- బోధన్‌లో చెట్టుపై పడ్డ పిడుగు

సాక్షి, నెట్‌వర్క్‌: జిల్లాలోని అన్ని గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. వడగండ్లకు కోతకు వచ్చిన వడ్లు రాలిపోయాయి. పొలాలు నేలవాలాయి. ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయింది. సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌, చిన్నవాల్గోట్‌, కొండూర్‌, రావుట్ల, చీమన్‌పల్లి, తాటిపల్లి, పలు గ్రామాల్లో వడగండ్ల వర్షం భారీగా కురిసింది. వందలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. బోధన్‌ పట్టణం రాకాసీపేటలోని మీ సేవా కేంద్రం వద్ద చెట్టుపై పిడుగు పడి మంటలు వచ్చాయి. సాలూర క్యాంప్‌ శివారులో చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి, గౌరారం, గన్నారం గ్రామాల్లో రాళ్ల వర్షం కురిసింది. ధర్పల్లి మండలంలోని నడిమి తండా, రామడుగు గ్రామాల్లో వడగండ్ల వర్షం కురడంతో వరి గింజలు నేల రాలాయి. ఉమ్మడి వర్ని మండలంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. చేతికి వచ్చిన పంట నేలరాలడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేసుల పరిష్కారంలో రాజీయే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత
- జిల్లా కోర్టులో జాతీయ లోక్‌ అదాలత్‌



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సునీత

ఖలీల్‌ వాడి: న్యాయస్థానాల్లో కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకుంటేనే రాజమర్గం అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్‌ సునీత కుంచాల అన్నారు. జాతీయ లోక్‌ అదాలత్‌ కార్యక్రమాన్ని జిల్లాకోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో సీపీ కల్మేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. చట్ట పరిజ్ఞానం సామాన్య ప్రజలకు మరింత చేరువ కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. న్యాయసేవల చట్టం ద్వారా ఏర్పర్చిన లోక్‌ అదాలత్‌లను సంపూర్ణంగా వినియోగించుకోవాలని కోరారు. సీపీ కల్మేశ్వర్‌ మాట్లాడుతూ.. లోక్‌ అదాలత్‌ల విజయవంతానికి పోలీసుశాఖ తనవంతు ప్రయత్నం చేస్తుందని అన్నారు. అనంతరం రాజీపద్ధతిన పరిష్కరించుకున్న కక్షిదారులకు లోక్‌ అదాలత్‌ అవార్డులను జడ్జి, సీపీ అందజేశారు. కార్యక్రమంలో అదనపు జిల్లాజడ్జి కనకదుర్గ, న్యాయసేవ సంస్థ కార్యదర్శి పద్మావతి, సీనియర్‌ సివిల్‌ జడ్జి శ్రీకాంత్‌ బాబు, జూనియర్‌ సివిల్‌ జడ్జి కుష్బూ, బార్‌ అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, అదనపు డిప్యూటీ పోలీస్‌ కమిషనర్‌ వెంకటేశ్వర్‌, ఏసీపీ రాజావెంకటరెడ్డి, న్యాయవాదులు, ఎస్బీఐ రీజినల్‌ మేనేజర్‌ శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో..

బోధన్‌: మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం బోధన్‌ కోర్టులో నిర్వహించిన లోక్‌ దాలత్‌లో సివిల్‌, క్రిమినల్‌ 819 కేసులు పరిష్కారమయ్యాయి. ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్‌.రవికుమార్‌, సీనియర్‌ సివిల్‌ జడ్జి అజయ్‌ కుమార్‌, ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి ఎ.పూజిత, అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివసాయి నేతత్వంలో వేర్వేరుగా నాలుగు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. న్యాయవాదులు మధుసింగ్‌, మారుతిరావు ఖన్నా, సీహెచ్‌ వి హన్మంతరావు, జి. కల్యాణి బెంచ్‌ సభ్యులుగా వ్యవహరించారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్‌ కోర్టులో శనివారం జాతీయ లోక్‌ అదాలత్‌ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. మున్సిఫ్‌ కోర్టు న్యాయమూర్తి హారిక జాతీయ లోక్‌ అదాలత్‌లో కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. వీటిలో బ్యాంకు చెక్‌ బౌన్స్‌, అబ్కారీ శాఖకు సంబంధించిన కేసులు 109 పరిష్కారం కాగా, పీటీ కేసులు 652 పరిష్కారమైనట్లు పేర్కొన్నారు.

ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌ టౌన్‌: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌ అదాలత్‌లో 2546 కేసులను పరిష్కారమైనట్లు సీనియర్‌ సివిల్‌ జడ్జి, న్యాయ సేవాధికార సంఘం చైర్‌పర్సన్‌ నసీం సుల్తానా తెలిపారు. కార్యక్రమంలో ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి, అసోసియేషన్‌ అధ్యక్షుడు చిన్నారెడ్డి, న్యాయవాదులు, పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు, పోలీసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



కాకతీయ కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 7500, సరస్వతి కాలువ ద్వారా 400, లక్ష్మి కాలువ ద్వారా 250, అలీసాగర్‌ లిఫ్ట్‌ ద్వారా 347, గుత్ప లిఫ్ట్‌ ద్వారా 270, ఆవిరి రూపంలో 494, మిషన్‌ భగీరథ ద్వారా తాగు నీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1064.40(20 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొన్నారు.

ప్రకటించిన నీటి లెక్కలు

ఎస్సారెస్పీ నుంచి కాలువల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల, ప్రాజెక్టు నీటి నిల్వ లెక్కలు ప్రతి రోజు ప్రకటించే అధికారులు గురు, శుక్రవారం ప్రకటించలేదు. దీంతో గోప్యత వెనుక మతలబేమిటి అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు శనివారం నీటి వివరాలను వెల్లడించారు.

ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు చేయాలి



అబుదాబీలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ధర్పల్లి: గల్ఫ్‌ కార్మికుల క్షేమం కోసం రూ. 500 కోట్ల నిధులు కేటాయించి ఎన్‌ఆర్‌ఐ పాలసీని వెంటనే అమలు చేయాలని జీడబ్ల్యూఏసీ అబుదాబీ ప్రెసిడెంట్‌ నరేందర్‌ డిమాండ్‌ చేశారు. శనివారం గల్ఫ్‌ వర్కర్స్‌ అవేర్నెస్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో అబుదాబి(యూఏఈ)లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి గల్ఫ్‌ దేశాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్‌, రవీందర్‌, రమేశ్‌, శివ సాయి, సూర్యం, మణి, మహేశ్‌, భాను తదితరులు పాల్గొన్నారు.

మాది మోదీ కుటుంబం

ఎంపీ ధర్మపురి అర్వింద్‌



బ్రోచర్‌ ఆవిష్కరిస్తున్న ఎంపీ అర్వింద్‌

డిచ్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్‌ పేర్కొన్నారు. మండలంలోని లింగసముద్రం గ్రామంలో శనివారం నిర్వహించిన బీజేపీ డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి మండలాల మండల స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్‌ కుమార్‌ తో కలిసి 'మాదీ మోదీ కుటుంబం' అనే బ్రోచర్లను ఆవిష్కరించారు. ప్రధాని నరేంద్ర మోదీ తోనే దేశభవిష్యత్‌, అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ నెల 18న జగిత్యాలలో నిర్వహించే ప్రధాని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రూరల్‌ అసెంబ్లీ కన్వీనర్‌ పద్మారెడ్డి, మండల అధ్యక్షులు వెంకటరమణ, నాయిడి రాజన్న, శ్రీనివాస్‌గౌడ్‌, నాయకులు కిషన్‌నాయక్‌, రవీందర్‌గౌడ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, చౌకి లక్ష్మణ్‌, పరుశురాం, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌ ఎన్నికల్లో సత్తా చాటాలి

మాక్లూర్‌: పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఎంపీ అర్వింద్‌ అన్నారు. మండల కేంద్రంలోని రఫత్‌ఖాన్‌ గార్డెన్‌లో పార్టీ బూత్‌స్థాయి అధ్యక్షులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఆర్మూర్‌ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

నా చావుకు కారణం ఆ తొమ్మిది మందే..

- పిలిచి మరీ అవమానించారు
- సెల్ఫీ వీడియో తీసి రైతు ఆత్మహత్య
- కామారెడ్డి మండలం లింగాయిపల్లిలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు



రవీందర్‌రెడ్డి(ఫైల్‌)

కామారెడ్డి క్రైం: పంట పొలం వద్ద ఆవును వదిలి పెట్టిన విషయంలో తలెత్తిన వివాదం ఒకరి ఆత్మహత్యకు దారి తీసింది. కూర్చొని మాట్లాడుకుందామని పిలిచిన వ్యక్తులు తలో మాట అనడంతో మనస్తాపానికి గురైన ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు కొద్ది క్షణాల ముందు తన చావుకు కారణాలను, కారకులను వివరిస్తూ అతడు సెల్ఫీ వీడియో తీసి గ్రామానికి చెందిన వాట్సప్‌ గ్రూప్‌లో పోస్టు చేయడం కలకలం రేపింది. ఈ ఘటన కామారెడ్డి మండలం లింగాయిపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోరెడ్డి రవీందర్‌రెడ్డి (42) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు అతని ట్రాక్టర్‌ ఇంజన్‌లో చక్కెర పోసి చెడగొట్టారు. ఈ విషయంలో గ్రామానికి చెందిన కల్లూరి వెంకట్‌కు రవీందర్‌ రెడ్డికి గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం ఆవును పంట పొలంలో వదిలి పెట్టిన విషయంలో మరోసారి వెంకట్‌కు, రవీందర్‌రెడ్డి, అతని అన్న కిష్టారెడ్డికి మధ్య గొడవ జరిగి పోలీస్‌స్టేషన్‌ వరకు వెళ్లింది. అదే గ్రామానికి చెందిన దేమె రవి ఫోన్‌ చేసి కూర్చొని మాట్లాడుకోవడానికి కామారెడ్డికి రమ్మని పిలువగా రవీందర్‌రెడ్డి, అతని అన్న కిష్టారెడ్డి వెళ్లారు. దేమె రవి, తోట భూపతి, కిషన్‌గౌడ్‌, కల్లూరి మల్లేషం, తోట ఉదయ్‌లు కలిసి మీరు తప్పు చేశారని, ఒప్పుకోవాలంటు పట్టుబట్టారు. అంతేగాకుండా దుర్భాషలాడినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన రవీందర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తన చావుకు 9 మంది వ్యక్తులు కారణమంటూ సెల్ఫీ వీడియో తీసి వాట్సప్‌ గ్రూపుల్లో పోస్టు చేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అతని కోసం గాలించారు. రాత్రి గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు దేమె రవి, తోట భూపతి, కిషన్‌గౌడ్‌, కల్లూరి మల్లేషం, తోట ఉదయ్‌, బోరెడ్డి నాగరాజు, మల్లారెడ్డి, భానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఎడపల్లి: మండలంలోని మంగల్‌పహాడ్‌లో ఒకరు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు. గ్రామానికి చెందిన ఇల్లందుల నరేందర్‌గౌడ్‌(42)కు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇంట్లో మరోసారి గొడవ జరగడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సుష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫరీద్‌పేటలో ఒకరి అదృశ్యం



స్వామి

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామానికి చెందిన బట్ట స్వామి అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ శనివారం తెలిపారు. ఈ నెల 15న పని నిమిత్తం బయటకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఎల్లారెడ్డి: పట్టణ శివారులోని పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై మహేశ్‌ శనివారం తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 5940 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

బాల్కొండ: లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్‌యాదవ్‌ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోర్తాడ్‌ మండలం తిమ్మాపూర్‌కు చెందిన వడ్ల గణేశ్‌(52) ముప్కాల్‌ నుంచి బైక్‌పై నిర్మల్‌ వైపు వెళ్తున్నాడు. మెండోరా మండలం దూదిగాం శివారులో రోడ్డు డైవర్షన్‌ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ గణేశ్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి జాలరి..

నందిపేట్‌: చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన ఒకరు ప్రమాదవశాత్తు వల చుట్టుకొని మృతి చెందిన ఘటన మండలంలోని అయిలాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హరీశ్‌(22) చిన్నతనంలోనే తల్లితండ్రులు మృతి చెందడంతో అతని బాబాయి పోశెట్టి వద్ద ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం చేపలు పట్టేందుకు ఇంటి నుంచి వెళ్లిన హరీశ్‌ తిరిగి రాలేదు. శనివారం ఉదయం చెరువు వద్ద మృతుడి టీషర్ట్‌ ఉండడంతో కుటుంబీకులు గజఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మేకల కాపరి..

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో విద్యుదాఘాతానికి గురై మేకల కాపరి మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్‌ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్‌ జిల్లా నర్సాకేడ్‌ గ్రామానికి చెందిన మల్లేశ్‌ (25) బతుకు దెరువు నిమిత్తం మెండోరాకు వచ్చి మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఉదయం మేకలను మేత కోసం మండల శివారుకు తీసుకెళ్లాడు. అక్కడ చెట్టుపై నుంచి కొమ్మలను నరుకుతుండగా విద్యుత్‌ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి లస్మయ్య ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

ఆర్మూర్‌ టౌన్‌: మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మామిడిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని ఓ వృద్ధుడు(70) రోడ్డు దాటుతుండగా ఆర్మూర్‌ నుంచి వరంగల్‌ వైపు వెళ్తున్న బస్సు ఢీకొన్నది. ఈ ఘటనలో వృద్ధుడికి గాయాలు కాగా స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. వృద్ధుడి ఆచూకి తెలిసినవారు ఆర్మూర్‌ పీఎస్‌లో సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

పెర్కిట్‌లో చోరీ



ఆర్మూర్‌టౌన్‌: మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌లో శుక్రవారం అర్ధరాత్రి మూడు ఇళ్లల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. 21వ వార్డులో ఉన్న అబ్దుల్‌ నయీముద్దీన్‌ ఇంట్లో సుమారు రూ. 2లక్షలు, 10 తులాల బంగారం, 22వ వార్డులో షబానా బేగం ఇంట్లో రూ. 80వేల నగదు, తులం బంగారాన్ని చోరీ చేశారు. అదే వార్డులో చిలక గంగుబాయి ఇంటికి ఉన్న తాళాన్ని ధ్వంసం చేసి చోరీ చేసేందుకు యత్నించగా పక్కనే నివాసం ఉంటున్న వారికి శబ్దం రావడంతో కేకలు వేయడంతో వారు పారిపోయారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్‌ నిర్వహించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆలయంలో..

సిరికొండ: మండలంలోని గోప్యానాయక్‌ తండాలోని జగదాంబదేవి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగిందని ఎస్సై రమేశ్‌ శనివారం తెలిపారు. ఆలయంలో ఉన్న అమ్మవారి విగ్రహం నుంచి అరతులం బంగారు తాళి, ఐదు తులాల వెండి విగ్రహం, హుండీ నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు వెల్లడించారు. తాండవాసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హిందూ వ్యతిరేకిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

పెర్కిట్‌: జగిత్యాలలో ఇటీవల ఎమ్మెల్సీ జీవన్‌ రెడ్డి ప్రవర్తించిన తీరు హిందూ వ్యతిరేకిగా ఆయన నిజస్వరూపం వెల్లడైందని ఎంపీ అర్వింద్‌ ఆరోపించారు. మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముస్లిములతో కలిసి ప్రధానిపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ అవహేళన చేయడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి కాంగ్రెస్‌ నాయకుల వల్లే జగిత్యాల పీఎఫ్‌ఐ వంటి నిషేధిత సంస్థలకు అడ్డాగా మారాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు బీజేపీకి ఎలాంటి సంభందం లేదని ఎంపీ స్పష్టం చేశారు. అనంతరం బీర్పూర్‌ జెడ్పీటీసీ భర్త రమేష్‌ బీజేపీలో చేరగా ఎంపీ అర్వింద్‌ ఆయనను పార్టీ కండువాతో ఆహ్వానించారు. సమావేశంలో అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్త, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి, మల్లికార్జున్‌ రెడ్డి, స్రవంతి రెడ్డి, పుప్పాల శివరాజ్‌, నూతుల శ్రీనివాస్‌ రెడ్డి, పాలెపు రాజు పాల్గొన్నారు.

మాదిగలు బీజేపీకే ఓటేయాలి



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న సరికెల పోశెట్టి

నిజామాబాద్‌అర్బన్‌: పార్లమెంట్‌ ఎన్నికల్లో మాదిగలు బీజేపీకే ఓటేయాలని జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో ఎమ్మార్పీఎస్‌ నాయకులు శనివారం సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో అర్బన్‌ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. మాదిగల కల అయిన ఎస్సీ వర్గీకరణను బీజేపీ నెరవేర్చబోతోందని అన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సరికెల పోశెట్టి, తలపాక సుమన్‌, యాద శ్రీరాములు, ఐలపాక సుమన్‌, సంజీవ్‌, రాంచందర్‌, శేఖర్‌, యాదగిరి, నవీన్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్‌లో అర్బన్‌ నియోజకర్గ సమావేశం నిర్వహించారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని మైలారం బాలు అన్నారు. కార్యక్రమంలో నాయకులు చేపూరి శ్యామ్‌, నాగం శ్రీనివాస్‌, పద్మ, సందీప్‌, బాబురావు, అభినవ్‌, తరుణ్‌, బన్నీ, మనోహర్‌, సూర్య, గణేశ్‌, రమణ, మున్నా, నితీశ్‌ పాల్గొన్నారు.

బస్టాండ్‌ను పరిశీలించిన సీపీ



అధికారులతో మాట్లాడుతున్న సీపీ

ఖలీల్‌వాడి: నగరంలోని రద్దీ ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండ్‌, రైల్వేస్టేషన్‌లను సీపీ కల్మేశ్వర్‌ శనివారం పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉండటంతో సెక్యూరిటీ ఎలా ఉంటుంది అనే విషయాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట ఏసీపీ రాజావెంకటరెడ్డి, ఎస్‌హెచ్‌వో విజయ్‌ బాబు, ఎస్బీ సీఐ శ్రీశైలం, పోలీసు సిబ్బంది, ట్రాఫిక్‌ పోలీసులు ఉన్నారు.

డీడీ మధుసూదన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

సుభాష్‌నగర్‌: జిల్లా భూగర్భ, గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ మధుసూదన్‌రెడ్డి, ఏడీ విజయ్‌ కుమార్‌ రాథోడ్‌, రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌ రమేశ్‌గౌడ్‌ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం వీరిని జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

సుల్తాన్‌షాప్‌లో అగ్ని ప్రమాదం

ఖలీల్‌వాడి: నగరంలోని గాంధీచౌక్‌లో ఉన్న సుల్తాన్‌ బట్టల దుకాణంలో శనివారం విద్యుదాఘాతం సంభవించి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న నిజామాబాద్‌, బోధన్‌కు చెందిన అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. దుకాణం నుంచి దట్టమైన పొగలు రావడంతో పోలీసులు చుట్టు పక్కల ఉన్న దుకాణాలను మూసివేయించారు. దీంతో ఆ ప్రాంతంలోని వాహనాల రాకపోకాలకు అంతరాయం ఏర్పడింది.

మద్యం దుకాణాల తనిఖీ



బిచ్కుంద: మండల కేంద్రంలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్‌ పోలీసులు శనివారం తనిఖీ చేపట్టారు. నకిలీ మద్యం విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో తనిఖీ చేసినట్లు సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. రికార్డులు, గోదాములు, దుకాణంలో ఉన్న మద్యం సీసాలను తనిఖీ చేశారు. తనిఖీలో ఎలాంటి నకిలీ మద్యం లభించలేదన్నారు. పిట్లం, బిచ్కుంద, మద్నూర్‌, జుక్కల్‌ మండలాల మద్యం దుకాణాల యజమానులు ఎక్సైజ్‌ శాఖ నిబంధనల ప్రకారం మద్యం విక్రయించాలని లేకుంటే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. సీఐ వెంట ఎస్సై నగేశ్‌, సిబ్బంది ఉన్నారు.